క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన యువకుడు పాంషావలి కుక్క కరవడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలను బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు రామనాయుడు, కిరణ్, నిరంజన్, మద్దిలేటి చేతుల మీదుగా వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు అందజేశారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.4లక్షలు మంజూరు

డోన్ టౌన్: స్థానిక గుండా వెంకటరత్నంశెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి రూ.3.99 లక్షలు మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి బుధవారం తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాది నాగభూషణం రెడ్డి కళాశాలలో విద్యుత్ సమస్యలపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు ఎంపీ ల్యాడ్స్ కింద నిధులు మంజూరు అయ్యాయని ఆమె తెలిపారు. కళాశాలకు 3ఫేస్ కరెంటు, సైన్స్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూమ్‌లకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన కల్పించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్ రావు

అవుకు: భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ ప్రసాద్ రావు ఆర్బీకే సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని మంగంపేట రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమెంట్ రిజిష్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించాలన్నారు. భూసార పరీక్షల మూలంగా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి చైతన్యపరచాలని వీఏఏ పార్థసారథికి సూచించారు.

ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సంజామల(కోవెలకుంట్ల): ఆధార్ నమోదుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. బుధవారం సంజామల మండలం కానాల గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక కేంద్రాల్లో కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేట్, మార్పులు, చేర్పులు తదితర సేవలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం మంజూరైన పక్కాగృహాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. బుధవారం మండలంలోని భీమునిపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షల బిల్లులు, రాయితీపై 504 కిలోల కడ్డీలు, 120 బస్తాల సిమెంట్, ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, హౌసింగ్ ఏఈ సుదర్శన్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

కొలిమిగుండ్ల: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉన్న కొలిమిగుండ్ల, చింతలాయిపల్లె గ్రామాలకు చెందిన జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఎంపీడీఓ సుబ్బరాజు పరిశీలించారు. కాలనీల్లో పర్యటించి నిర్మాణాలు పర్యవేక్షించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అందుబాటులో ఉందని, త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ తాహిర్ హుశేన్, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న ఆంజనేయులు,ఏపీఓ గంగన్న పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

డోన్ టౌన్ : పట్టణంలోని షాదిఖానాలో మూడు రోజులుగా జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మూడవ మహా సభల్లో చివరి రోజు బుధవారం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష,కార్యదర్శులుగా డక్కు కుమార్, అరదేశి నిరంజన్, ఉపాధ్యక్షులుగా తెలుగు విజయ్‌కుమార్, దినేష్‌కుమార్, సయ్యద్ ఇర్ఫానా, సహాయ కార్యదర్శులుగా అశోక్, కిరణ్, ప్రతాప్, కోశాధికారిగా గడ్డం ఓబులేసు, కమిటీ సభ్యులుగా కిషోర్, శివ, సునీల్, శేషాద్రినాయుడు, హరివర్ధన్, ప్రేమ్, రమణ, శ్రీహరి ఎంపికయ్యారు.

అంకితభావ సేవలకు ప్రతిఫలం

- ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దడంలో సర్పంచ్‌లు, అధికారుల కృషి అభినందనీయం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతులపాపిరెడ్డి



రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక అయిన ఇల్లూరుకొత్తపేట సర్పంచ్ రమణ, పంచాయతీ కార్యదర్శి నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: మండల పరిధిలోని ఇల్లూరుకొత్తపేట రాష్ట్రస్థాయిలో, బనగానపల్లె, పలుకూరు, రామక్రిష్ణాపురం ఇల్లూరుకొత్తపేట జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపిక కావడం సంతోషకరమని, ప్రజలకు అందజేసిన అంకితభావ సేవలకు ప్రతిఫల లభించిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతులపాపిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను బుధవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఇల్లూరుకొత్తపేట సర్పంచ్ జి రమణ, పంచాయతీ కార్యదర్శి నాయక్‌ను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా బనగానపల్లె, పలుకూరు, రామక్రిష్ణాపురం, సర్పంచ్‌లు ఈసారి యల్లమ్మ, కోనేటి సుమలత లక్ష్మీదేవి, బనగానపల్లె ఈఓ ఖాలిల్, పలుకూరు ఈఓ శ్రీనివాసులు, రామక్రిష్ణాపురం పంచాయతీ కార్యదర్శి మంజునాథ్‌తోపాటు ఎంపీడీఓ శివరామయ్యను వారు సత్కరించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్రామాల్లో జరుగు అభివృద్ధి సంక్షేమానికి సంబంధించి 9 అంశాలపై ఉన్నతాదికారులు సర్వే చేసి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 27 ఉత్తమ పంచాయతీలు ఎంపిక కాగా ఇందులో బనగానపల్లె మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలు ఎంపికకావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శివరామయ్యతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులకు ఎమ్మెల్యే కాటసాని అభినందనలు తెలిపారు. గాంధీజీ కలలుకన్న గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన తరువాత అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా భావించి గ్రామాల అభివృద్ధికి అక్కడి సిబ్బంది పని చేస్తున్నట్లు కొనియాడారు. ప్రతి పంచాయతీని ఉత్తమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ పాలనలో గ్రామపంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించేవికావన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి బకాయిలను కూడ చెల్లించడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధిలో నియోజకవర్గం ముందంజ

అభివృద్ధి సంక్షేమంలో బనగానపల్లె నియోజకవర్గం ముందంజలో ఉన్నట్లు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో గతంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో నేడు అమలు చేస్తున్న జల్‌జీవన్ పథకం ద్వారా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషితో ఆ సమస్యలేదన్నారు. ఈ విషయంపై సెంట్రల్ కమిటీ కూడ ఆనందం వ్యక్తపరిచిన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు అనిల్, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, జాహెద్‌హుస్సేన్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో అవార్డు రావడం అభినందనీయం

బేతంచెర్ల: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ సిమెంట్ నగర్‌కు జిల్లా స్థాయిలో (సుపరిపాలన) ఉత్తమ పంచాయతీ అవార్డు రావడం అభినందనీయం అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న గ్రామ సర్పంచ్ ఏస్తేరమ్మను గ్రామ సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యాకోబ్, యోబ్, రంగస్వామి, ఐజయ్య, మా బాషా, రాజేష్ వార్డు మెంబర్ జేమ్స్, డీలర్ రఫీ పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలని హెచ్ఎంలకు ఎంఈఓ సోమశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీపై హెచ్ఎంలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాడు–నేడు పనులు, బడి బయట పిల్లల గుర్తింపు, బాల్య వివాహాలు తదితర విషయాలపై ఆర్పీ మౌలాలి అవగాహన కల్పించారు.

పేద ప్రజలకు అండగా సీఎం జగనన్న



రూ.80 వేల చెక్కును అందజేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన కలగోట్ల మల్లేష్‌కు యాక్సిడెంట్ అయ్యి చేతికి తీవ్రగాయాలయ్యాయి. ఆపరేషన్ కోసం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన రూ.80 వేలు చెక్కును మల్లేష్‌కు బుధవారం ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, ఎద్దులన్న, తిమ్మయ్య పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించిన ఘనత జగన్‌దే



ఎమ్మెల్యే కాటసాని నుంచి నియామక పత్రం అందుకుంటున్న శివవరం నాగేశ్వరరావు

బనగానపల్లె: ఆలయాల్లో పాలక మండలి సభ్యులలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్వగృహం వద్ద యాగంటి ఆలయ పాలక మండలి సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు చెందిన శివవరం నాగేశ్వరరావుకు నియామక పత్రం ఎమ్మెల్యే కాటసాని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో చంద్రబాబు నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తామని హేలన చేశారని, బీసీలు అంటే ఎంత చులకనో తెలిసిందన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రహ్మణ సంఘం అధ్యక్షులు మధు,ప్రధాన కార్యదర్శి శివయ్య,కోశాధికారి మల్లికార్జున,కార్యదర్శి మద్దిలేటి, నాగేశ్వరరావు,వార్డు సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత

- ప్రభుత్వ భవనాలతో పల్లెలకు పట్టణ శోభ
- అందుబాటులోకి మెరుగైన వైద్యం
- ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్ నూతన భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని



వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండలం చిన్నకొప్పెర్లలో రూ. 21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమానికి ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చిట్రెడ్డి విజయలక్ష్మి, మోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో పరిపాలనను వికేంద్రీకరణ చేసి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమైందన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్‌హెల్త్‌క్లినిక్, తదితర ప్రభుత్వ భవనాలను అన్ని హంగులతో ఏర్పాటు చేయడంతో పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుందన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, విద్యాదీవెన, వసతిదీవెన, నేతన్ననేస్తం, చేదోడు, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు, తదితర 32 రకాల సంక్షేమ పథకాలను మహిళలకు అందజేస్తూ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తుండటాన్ని ప్రతిపక్ష టీడీపీ జీర్ణించుకోలేక పోతోందని విమర్శించారు. అసత్య ప్రచారాలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి కన్పించడం లేదా అని మండి పడ్డారు.

చిన్నకొప్పెర్లను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం

చిన్నకొప్పెర్ల గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో రూ. 1.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ, రోడ్ల విస్తరణ, తదితర మౌలిక వసతులు, గ్రామం నుంచి కైపకు వెళ్లే ఆయకట్టు రోడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, డీవీ శేషిరెడ్డి, బాలమద్దిలేటి, ఓబుళపతిరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఈఓపీఆర్‌డీ రాధిక, డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, వల్లంపాడు రామిరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, ఉసేన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రాచంరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, గజ్జెలరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, రమణారెడ్డి, జయభారత్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బీభత్సం సృష్టించిన అకాల వర్షం

కోవెలకుంట్ల: అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతున్నాయి. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అవుకు మండలంలో అత్యధికంగా 25.2 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 2.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా కొలిమిగుండ్ల, సంజామల మండలాల్లో మోస్తరు వర్షం పడింది. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల వరి, మిరప రైతులకు నష్టం మిగిల్చింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి దశలో ఉండగా అకాలవర్షంతో పైరు నేలవాలింది. మిరపలో చివరి కోత దిగుబడులు తడిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి, మిరప దిగుబడులు తడవకుండా పట్టలు కప్పుకుని కాపాడుకున్నారు.

కొలిమిగుండ్ల: అకాల వర్షం రైతన్నకు తీవ్ర నష్టం మిగిల్చింది. అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం మోస్తారు మించి వర్షం కురిసింది. కమ్మవారిపల్లెలో గోదుమ పంట నేలకొరిగింది. నందిపాడు, కోటపాడు, నాగిశెట్టిపల్లె, యర్రగుడి, చింతలాయిపల్లె, మదనంతపురం తదితర గ్రామాల్లో మిర్చి రైతులు ఇబ్బందులు పడ్డారు. కొలిమిగుండ్లలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో ప్రధాన రహదారిపై వర్షం నీటి నిల్వతో వాహన చోదకులకు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్‌రెడ్డి జెసీబీ సాయంతో నీళ్లు రోడ్డుపై నుంచి బయటకు వెళ్లేలా చేయించారు.

అవుకు: మండలంలో బుధవారం అకాల వర్షం బీభత్సం సృష్టించింది. మూడు రోజులుగా కురిసిన వర్షాల ధాటికి కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, మిరప పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. ప్రాథమిక అంచనా ప్రకారం 225 హెక్టార్లలో వరి, 55 హెక్టార్లలో మొక్కజొన్న దెబ్బతినిందని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని ఏఓ ప్రసాద్ రావు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బనగానపల్లెరూరల్: మండలంలో బుధవారం ఉదయం నుంచి కురిసిన అకాలవర్షాని దెబ్బతిన్న పంటలను ఏఓ సుబ్బారెడ్డి పరిశీలించారు. కైప, యాగంటిపల్లె, బనగానపల్లె గ్రామాల్లోని వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో సుమారు 225 హెక్టార్ల వరకు వరి, మొక్కజొన్న 98 హెక్టార్లలో పంట నష్టం జరిగి ఉంటుందని, రెండు రోజుల్లో పూర్తి వివరాలను అంచనవేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వెంకటరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని ముదిగేడు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్. ధరించి ప్రయాణం చేయాలని సూచించారు.

ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి



నూతన ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న గాథంశెట్టివేణుగోపాల్, చిత్రంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: ఆర్యవైశ్యులు వ్యాపార,సేవ కార్యక్రమాలతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆర్యవైశ్య సంఘం నూతన పట్టణ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాథంశెట్టివేణుగోపాల్‌తో పాటు కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కె.శివచంద్రయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్య వైశ్యబ్రాహ్మణ శ్మశాన వాటిక సమస్య తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే రూ.8.50 లక్షలలు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అవసరమైతే మరో రూ.10లక్షలు మంజూరు చేస్తామన్నారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా ఎనికైన గాథంశెట్టివేణుగోపాల్‌తో ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బీరబల్లమ్మ నాగసత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేందరకుమార్, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, కోవెలకుంట్ల మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు పీఎస్ఎస్ సత్యనారాయణ, నాయకులు శ్రీరామవెంటకసుబ్రహ్మణ్యం, రామక్రిష్ణ, రాంమూర్తి, జక్కానాగరాజు, నల్లగట్ల వెంకటేశ్వర్లు, నూకల విజయకుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీసుధ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్: ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో శ్రీసుధ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి టౌన్ టాపర్‌గా నిలిచారు. ద్వితీయ ఎంపీసీ విభాగంలో వెంకటలక్ష్మీ 986, అజయ్‌కుమార్ 984, సుదర్శన్ 983, శ్రీవల్లి 983, క్రిష్ణకిషోర్ రాయల్ 982, శ్రీజ 980 సాధించగా బైపీసీలో శ్రీవిద్య, కావ్యాంజలిలకు 987, రజిత 985, హిమజ 979, ఎంఈసీ విభాగంలో సాయిప్రీతి 970, ప్రణీత 965 మార్కులు సాధించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 35మంది పరీక్షలకు హాజరు కాగా 46శాతం ఉత్తీర్ణత సాధించగా ఫస్ట్ ఇయర్‌లో 61మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 26శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య తెలిపారు.

59 శాతం ఉత్తీర్ణత

కొలిమిగుండ్ల: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి కొలిమిగుండ్ల ప్రభుత్వ కళాశాల మొదటి సంవత్సరం ఫలితాల్లో మొదటి స్థానంలో నిలవగా, సెకండియర్‌లో తొమ్మిదవ స్థానంలో నిలిచిందన్నారు. మొదటి సంవత్సరంలో 29 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది ఉత్తీర్ణులు కావడంతో 59 శాతం ఫలితాలు సాధించారు. సెకండియర్‌లో 65 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 34 మంది పాస్ కావడంతో 52 శాతం ఉత్తీర్ణత శాతం వచ్చిందన్నారు. మోడల్ స్కూల్‌కు చెందిన కళాశాలలో మొదటి సంవత్సరంలో 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి తెలిపారు. అలాగే సెకండియర్‌లో 50 శాతం ఫలితాలు సాధించామన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ షమీల తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 74 మంది విద్యార్థులకు గాను 25 మంది, ద్వితీయ సంవత్సరంలో 78 మంది విద్యార్థులకు గాను 23 మంది ఉత్తీర్ణ త సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సాహితి 408, హుమేరా 408 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దీపిక 952, భారతి, 950, కీర్తి 934, చంద్ర కళ 929 మార్కులు సాధించారని వివరించారు.

ఎస్సీ,ఎస్టీ కేసు నిందితులకు 14 రోజుల రిమాండ్

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో గ్రామానికి చెందిన ఎద్దులన్నను కులం పేరుతో దూషించి, దాడి చేశారని గత నెల 24వ తేదీన బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో నిందితులు పోలూరు రాఘవరెడ్డి, పోలూరు వెంకటేశ్వర్‌రెడ్డి, జువ్వాజి వెంకటేశ్వర్లు, కానాల శేషిరెడ్డి కర్నూలు ఎస్సీ, ఎస్టీ కోర్టులో బుధవారం లొంగిపోగా న్యాయం స్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించిందని ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. వారిని కర్నూలు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ఆర్ బుక్కాపురం గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుగ్గన చంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో బుధవారం ఎంపీడీఓ వెంగన్న, ఎంపీటీసీ సభ్యుడు మునేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరితా రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వారు ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీయగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని, గృహాలు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటుతో పాటు అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రానున్న రోజుల్లో వాటర్ గ్రిడ్ పథకం ద్వారా 330 కోట్లతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి సురక్షితమైన నీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు బలరాముడు, రమణ, ఆర్వేటీ శేఖరయ్య, సురేష్, నాయుడు, మనోహర్, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



శ్రావణి (441) కీర్తన(436) అనుష(944) మమత(913) పద్మావతి(927) మహిమాన్విత (919)

కోవెలకుంట్ల: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం విడుదలైన ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సర ఫలితాల్లో పట్టణ శివారులోని గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో 67 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా 49 మంది ఏగ్రేడ్, 10 మంది బీగ్రేడ్, ఒకరు సీ గ్రేడ్‌లో పాసై 90 శాతం, ప్రథమ సంవత్సరంలో 85 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఫిర్దౌస్ అంజుమ్ తెలిపారు. ప్రథమ సంవత్సర ఎంపీసీలో శ్రావణి 441 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. కీర్తన 436 మార్కులు, సీనియర్ ఎంపీసీలో అనుష 944 మార్కులు, మమత 913, బైపీసీలో పద్మావతి 927, మహిమాన్విత 919 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



అమృత(973) మంజుల(940) షబీయాబీ (957)

కోవెలకుంట్ల: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం విడుదలైన ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సర ఎంపీసీ గ్రూపులో అమృత 973 మార్కులు సాధించి సత్తా చాటింది. ఇదే గ్రూపులో శ్రావణి 931, లక్ష్మి 920, బైపీసీలో మంజుల 940 మార్కులు, ముబీనా 929, హెచ్ఈసీలో షబీయాబీ 957, రిజ్వానా 900 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో అక్షయ 909, మయూరి 908 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మద్దిలేటి స్వామి తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



మానస, సీనియర్ బైపీసీ 976 మార్కులు | ధనరాజ్, సీనియర్ సీఈసీ 890 మార్కులు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మంచి ప్రతిభ చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. సీనియర్ బైపీసీలో మానస 976 మార్కులు, ఎంపీసీలో లహరి 933 మార్కులు, సీఈసీలో ధనరాజ్ 890 మార్కులు, హెచ్ఈసీలో కావ్య 686 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. జూనియర్ బైపీసీలో సువర్ణ 399 మార్కులు, ఎంపీసీలో ప్రియాంక 441 మార్కులు, సీఈసీలో వైష్ణవి 457 మార్కులు, హెచ్ఈసీలో సనోవర్ బాను 445 మార్కులు సాధించినట్లు తెలిపారు.